# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 182 | పేజీలు : 8 | వెల : రూ.2/- మంగళవారం 28 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం




## పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

### - మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా




**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 27:** పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా వి పక్షాలు ముందుకు రాలేదు. నీట్–యూజీ మిగతా2లో...




## కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 27:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మిగతా2లో...

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

- ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు
- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి




## మిషన్ శక్తి-శాట్‌కు జెస్సీ ఎంపిక

- లోకేశ్‌తో భేటీ..అభినందించిన మంత్రి




## ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

### విమానాశ్రయ ప్రారంభోత్సవంపై సిఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,మన జనప్రగతి జూలై 27:** భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగా పురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం మిగతా2లో...

## పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

- సేవల సంఖ్య ఆధారిత ర్యాంకుల విధానానికి స్వస్తి
- మాతా శిశు ఆరోగ్యం నుంచి ప్రజల సంతృప్తి వరకు 21 అంశాల ఆధారంగా మార్కులు
- మాతృత్వ మరణాలు, సిజేరియన్లు తగ్గిన ఆసుపత్రులకు ర్యాంకింగ్ లో ప్రాధాన్యం

-రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్



**అమరావతి,మన జనప్రగతి జూలై 27:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా... అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. 'సంజీవని', 'మాతృత్వ', 'క్షేమ' కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ... మిగతా2లో...



## అర్హులందరికి సంక్షేమ పథకాలు

### రెండేళ్ల పాలనలపై ప్రచారంలో మంత్రి అనిత

**అనకాపల్లి,మన జనప్రగతి జూలై 27:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్ పేటలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యంతో సాగుతున్నాయని వివరించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామా గా మారుతుందని చెప్పారు. పాయకరావుపేట నియోజక వర్గం పరిశ్రమలకు పర్యాటక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మా రుస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్,పెద్దిరెడ్డి చిట్టిబాబులు పాల్గొన్నారు.

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్


### - తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్‌లో పోస్ట్

**అమరావతి,మన జనప్రగతి జూలై 27:** పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం



ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. మిగతా2లో...

## కోలుకుంటున్న పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల



**అమరావతి,మన జనప్రగతి జూలై 27:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోలుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శనివారం హైదరాబాద్ మిగతా2లో...

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పీహెచ్‌సీల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని... వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ... గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేవలం సేవల సంఖ్యనే కాకుండా, వాటివల్ల ప్రజలకు కలిగిన ఆరోగ్య ప్రయోజనాలకు గుర్తింపునిస్తూ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించారు.సదరు పీహెచ్సీ ల పరిధిలో నమోదయ్యే టీనేజ్ గర్భధారణలు, హైరిస్క్ గర్భిణుల నమోదు, గర్భధారణ కాలంలో అందించే వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల శాతం, మొత్తం సంతానోత్పత్తి రేటు, మాతృ మరణాల నియంత్రణను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త ర్యాంకింగ్‌లో ఇవి అత్యంత కీలకం కానున్నాయి. శిశు మరణాలు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, ఏడాదిలోపు శిశువులకు పూర్తిస్థాయిలో టీకాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో ఆలస్యాన్ని గుర్తించే పరీక్షలను కొత్త విధానంలో చేర్చారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడంతోనే అధికారుల బాధ్యత ముగియదు. వైద్యాధికారి సూచించిన పిల్లలకు వాస్తవంగా చికిత్స అందిందా? లేదా? అన్న అంశాన్నీ పరిశీలిస్తారు. దీనివల్ల పరీక్షల దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వీలవుతుంది. మధుమేహం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కొత్త విధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. సాధించిన మొత్తం స్కోరును శాతంగా మారుస్తారు. లక్ష్యాన్ని ఎక్కువగా సాధించాల్సిన అంశాల్లో మెరుగైన ఫలితాలకు అధిక స్కోరు ఇస్తారు. మాతృ మరణాలు, శిశు మరణాలు, టీనేజ్ గర్భధారణలు, సిజేరియన్ ప్రసవాల వంటివి తక్కువగా నమోదైన కేంద్రాలకు మెరుగైన స్కోరు లభిస్తుంది. 'ఏ ' గ్రేడ్: 80% నుంచి 100% 'బి గ్రేడ్: 70% నుంచి 80% లోపు 'సీ' గ్రేడ్: 60% నుంచి 70% లోపు 'డి' గ్రేడ్: 60% కంటే తక్కువ "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఠ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

# కేంద్రం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది



- మళ్లీ ఆందోళన చేపడతాం
- కొనసాగుతున్న పోలీసు చర్యపై

### కేంద్రానికి సీజేపీ అల్టిమేటం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 27:** కేంద్ర ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, అలాగైతే మళ్లీ ఆందోళన చేపడతామని కొనసాగుతున్న పోలీస్ చర్యపై కేంద్రానికి సీజేపీ అల్టిమేటం జారీ చేసింది. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఆందోళనలో నిరసనకారులను నిర్బంధించడం, అరెస్టు చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వారికి న్యాయపరమైన మద్దతు అందించడానికి, సాక్ష్యాలను భద్రపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్టు సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో కలిసి వారు మాట్లాడారు. నిరసనలకు సంబంధించిన అసలైన ఫొటోలు, వీడియోలను ట్యాంపర్-ఎవిడెంట్ సాక్ష్యంగా భద్రపరచడానికి, అలాగే న్యాయ సహాయ బృందాలు వాటిని ఉపయోగించుకోవడాన్ని సులభతరం చేయడానికి రూపొందించిన 'సాక్షి' అనే వెబ్‌సైట్, అప్లికేషన్‌ను కూడా సీజేపీ ప్రవేశపెట్టింది.విలేకరుల సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూ... 36 రోజుల ఆందోళనను ఉపసంహరించుకున్న తర్వాత నిరసనకారులు చర్యలను ఎదుర్కోవచ్చనే ఆందోళనల నేపథ్యంలో సీజేపీ.. కపిల్ సిబల్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉందని, ఆయన న్యాయ సలహా కోరిందని తెలిపారు. "మేము కపిల్ సిబల్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, న్యాయ సలహా కూడా తీసుకున్నాం. 25న మేము నిరసనను విరమించుకున్నప్పుడు, భవిష్యత్తులో ఈ ఉద్యమం సద్దుమణిగిన తర్వాత ప్రభుత్వం నిరసనకారులను లక్ష్యంగా చేసుకోవడం ప్రారంభిస్తుందేమోనని మాకు అనుమానం కలిగింది. ఇది చాలా విశ్వసనీయమైన అనుమానం. ఎందుకంటే ఇతర ప్రధాన నిరసనలలో కూడా ఇదే తరహా వ్యూహాన్ని అనుసరించడం గమనించాం. అక్కడ వ్యక్తులను ప్రత్యేకంగా గుర్తించి, వారిపై తప్పుడు కేసులు బనాయించారు. మొదటి రోజు నుంచే విద్యార్థులందరికీ న్యాయ, వైద్య సహాయం అందించడంతో పాటు, దేశవ్యాప్తంగా వారికి మద్దతు అందేలా న్యాయవాదులతో సమన్వయం కూడా ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 27:**నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది.ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

**అమరావతి,మన జనప్రగతి జూలై 27:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్్గ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్్గ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతి స్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

# మిషన్ శక్తిశాట్‌కు జెస్సీ ఎంపిక

**అమరావతి,మన జనప్రగతి జూలై 27:** మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ విద్యార్థిని కందుల జెస్సీ సోమవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంత్రి నారా లోకేష్.. జెస్సీని అభినందించారు. జెస్సీకి అన్ని విధాల మద్దతుగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఏపీలో స్పేస్ సిటీ క్లస్టర్ అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. అంతరిక్ష రంగంలో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా మిషన్ శక్తిశాట్ పోస్టర్‌ను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. జెస్సీ మాట్లాడుతూ.. 'అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రయోగాలతో అంతరిక్షంపై ఆసక్తి పెరిగింది. భవిష్యత్ లక్ష్యం ఏరోనాటికల్ ఇంజనీర్ కావడమే' అని అన్నారు. ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికై కందుల జెస్సీ రికార్డు సృష్టించారు. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో జెస్సీ చోటు దక్కించుకుని.. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచారు. 108 దేశాల నుంచి సుమారు 12 వేల మంది బాలికలు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోగా.. పలు దశల ఎంపిక పక్రియ అనంతరం జెస్సీ తుది జాబితాలో స్థానం సంపాదించారు. ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకే కాకుండా రాష్టానికీ గర్వకారణంగా మారింది.

# ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు.

అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధిం చిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# కోలుకుంటున్న పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదు

**● అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు అందించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 27:–**ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీని పరిశీలించి, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కేవలం అర్జీని ముగించడం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించి నిర్ణీత గడువు లోపు సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై సత్వరమే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో ఉండాలని ఆదేశించారు. పరిష్కారం సాధ్యం కాని అంశాల్లో కారణాలతో పాటు తదుపరి చర్యల గురించి అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న 'రీ–ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులను పూర్తిగా తగ్గించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి సంక్షేమం,అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 27:–** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న "నమ్మకం అభివృద్ధి, సంక్షేమం డోర్ టు డోర్" కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆదివారం ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ (బూత్ నెం. 224)లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, గ్రామంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయనే అంశాలపై ప్రతి కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకులు కొండవీటి భావన, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బచ్చల ప్రతాప్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.ఎస్. జబివుల్లా, బీజేపీ జిల్లా కార్యదర్శి కోనేటి ప్రదీప్, జనసేన నాయకులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్లస్టర్ యూనిట్ బూత్ కన్వీనర్ 266 మురళికి సన్మానం



**దేవనకొండ మన జనప్రగతి జూలై 27:–** ఆలూరునియోజకవర్గం ఇంచార్జి వైకుంఠం జ్యోతి కార్యాలయం లో మొన్నటి రోజున చంద్రబాబు నాయుడు ఆస్పరి పర్యటన సందర్భంగా జరిగిన క్యాడర్ మీటింగ్ లో వివిధ క్యాటగిరిలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్లస్టర్ యూనిట్ బూతు కన్వీనర్లకు సన్మానం చేయడం జరిగింది.సన్మానం పొందిన వారిలో దేవనకొండ మండలానికి చెందిన వన్నూరుప్ప బూతు నంబర్ 266 తోగటి మురళి బూతు నంబర్ 254 ఇంచార్జి చేతుల మీదుగా సన్మానం చేయడం జరిగింది అదేవిదంగా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 2 సంవత్సరాల పరిపాలన అభివృద్ధి సంక్షేమం గురించి 45 రోజుల పాటు జరిగే కార్యక్రమం లో అందరు నాయకులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్ మల్లికార్జున గౌడ్ ఈదులదేవరబండ సుభాన్ ఆకుల వీరేష్ బండిగింజల రంగన్న కప్పట్రాళ్ల మల్లికార్జున రాజుగోపాల్ గౌడ్ నక్క బాలకృష్ణ శాంత కుమార్ గౌడ్ కురువ రామలింగడు సురేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 100 ఫిర్యాదులు.**

**● కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 27:**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.కర్నూల్ కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 100 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐలు శివశంకర్, ఇస్మాయిల్ , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

**● ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు**



**డోన్ మన జనప్రగతి జూలై 27:–**టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. నంద్యాల జిల్లా, డోన్ పట్టణంలోని, ఐ.టి.ఐ లో టెలికం వినియోగదారుల అవగాహన సదస్సు పి.ఎస్.ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాయ్ కాగ్ మెంబర్–డాక్టర్ బత్తుల సంజీవరాయుడు మాట్లాడుతూ టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ ట్రాయ్ ప్రధాన బాధ్యతల్లో సెల్ వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం ఒకటి అన్నారు. మెరుగైన టెలికామ్ సేవలు అందించడం కోసం సెల్ కంపెనీలు అయిన జియో, ఎయిర్టెల్ , బిఎస్ఎన్ఎల్, వోడాఫోన్ మొదలగు కంపెనీల సేవలపై నిబంధనలు, ఆదేశాలు, పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులను జారీ చేస్తుందని పేర్కొన్నారు. టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు మనదేశంలో మెరుగైన సేవలు ట్రాయ్ ద్వారా పొందుతున్నారన్నారు. వివిధ టెలికామ్ సేవలు మరియు కేబుల్ టీవీ సేవలు నాణ్యతా ప్రమాణాలను సమర్ధవంతంగా రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ అనే స్వతంత్ర నియంత్రణ సంస్థను రూపకల్పన చేసి అమలులోకి తెచ్చిందని చెప్పారు. అంతేకాక ట్రాయ్ నిబంధనల ప్రకారము, టారిఫ్ సిస్టం, వ్యాపార ప్రకటనల నిశిద్ధం, సేవల నాణ్యత ప్రమాణాలు, మొబైల్ నంబర్ పోర్టబులిటీ, సౌకర్యం విలువతో కూడిన సేవలు, రక్షణ, వినియోగదారుల హక్కులు మరియు మొబైల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ ఆవిర్భావ ఆశయం అన్నారు. ప్రస్తుత తారీఫ్ ఇతర కంపెనీల కంటే తక్కువగా బిఎస్ఎన్ఎల్ ఉండడమే కాక బిఎస్ఎన్ఎల్ లో కూడా 4 జీ సేవలు రావడం ద్వారా వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, డి.టి.ఓ పురంధరప్రసాద్ , టి.ఓ నాగేంద్ర ప్రసాద్, ఎ.టి.ఓ లు శ్రీధర్, జగన్ , ఏ.ఇ నాగరాజు, వడ్డే నాగరాజ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి మన జనప్రగతి జూలై 27:–** నగర అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలు 22ఏ కింద ఉన్నాయని వీటిని వీలైనంత త్వరగా తొలగిస్తామని ఆయన చెప్పారు. సోమవారం ఉదయం ఒకటవ డివిజన్ లోని కొత్తపల్లి పరిధిలోని మస్తాన్ నాయుడు ప్లాట్స్, రవీంద్రనగర్ లలో 71 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి లు ప్రారంభించారు. కొత్తపల్లిలో రోడ్లు నిర్మించి తమను ఆదుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. అలాగే రవీంద్రనగర్ లో తాగునీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ తోపాటు ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. రవీంద్ర నగర్ లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. రోడ్ల నిర్మాణంను ప్రాధాన్యత ఇస్తామని ఆమె చెప్పారు. రవీంద్రనగర్ లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. 22ఏ కింద నగరంలో 17వేల ఇళ్లకు పైగా ఉన్నాయని రవీంద్ర నగర్ తో పాటు నగరంలోని మిగిలిన ప్రాంతాలను 22ఏ నుంచి తొగించే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఆయన చెప్పారు. నగర పరిధిలోని చెరువుల పూడిక తీసి సుందరంగా చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మాస్టర్ ప్లాన్ రోడ్లను వేసి నగరంలోని అంతర్గత రోడ్లను మరిచారని ఆయన ఆరోపించారు. కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. శ్యాంసుందర్, డీఈ రమణ, మాజీ కార్పొరేటర్ ఎస్.కే.బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటికీ టీడీపీ ప్రచారం: మండల కన్వీనర్,కురుబ మల్లెన్న



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 27:–**ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అదేశాలు మేరకు నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం..అభివృద్ధి, సంక్షేమం,డోర్ టూ డోర్ కార్యక్రమంలో బీఎల్ఏలతో కలిసి ఉద్దేహల్,బొమ్మనహాల్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం చేసిన సంక్షేమాని మండల కన్వీనర్ కురుబ మల్లన్న ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ కురుబ మల్లన్న మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందిన కుటుంబాలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు,ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని,ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, బీఎల్ఏలు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

# షర్మిల త్వరగా కోలుకోవాలని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

**- కాంగ్రెస్ నాయకుల ఆకాంక్ష.**

**- ప్రజాసేవలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ప్రార్థనలు**



**కడప మన జనప్రగతి జూలై 27:–**ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ సోమవారం కడపలోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ ప్రార్థన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ శాంతి స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, షర్మిలా రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని, ప్రజాసేవను మరింత ఉత్సాహంగా కొనసాగించాలని దేవుని ప్రార్థించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఆమె త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కడప కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శులు షామీర్ హుస్సేన్, పాల్ సుధాకర్, 43వ డివిజన్ ఇన్‌చార్జి జబీర్ అలీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి పథకాలు ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



**పత్తికొండ మన జనప్రగతి జులై 27:–**తేదీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలునలకదొడ్డి టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాల వ్యవధిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలు,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటా స్పష్టంగా కనిపించాలని పార్టీ అధిష్టానం ఆదేశించడంతో ఎమ్మెల్యే కేఈ. శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ఆగ్రామ టిడిపి అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆధ్వర్యంలో 'ఇంటింటి ప్రచారం' నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి,కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక 'సూపర్ సిక్స్' పథకాలు మరియు రెండేళ్ల సంక్షేమ విజయాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు.ప్రచారంలో భాగంగా ప్రతి కుటుంబంతో నాయకులు నేరుగా మాట్లాడారు.ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నామని, కూటమి పాలన పట్ల పూర్తి సంతృప్తితో ఉన్నామని స్థానిక మహిళలు,వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు.పేద,మధ్యతరగతి వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ నేతృత్వంలో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రఘుశేఖర్,దశరథ్ నరసప్ప,రామాంజనేయులు.శీను,సూరేంద్ర.రామలింగప్ప కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పేడ రంగు తాగి మహిళా మృతి

**- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు**

**బేతంచెర్ల మన జనప్రగతి జులై 27**: బేతంచర్ల మండలం బలపాలపల్లె గ్రామానికి చెందిన తిరుమలి ( 30 ) పే డరంగు ( విషయం )తాగి సోమవారం మృతి చెందిం ది. మృతురాలి బంధువుల వివరాల మేరకు... కుటుంబ కలహాలతో క్షణికావేషం లో పేడరంగు తాగిందన్నారు. మృతురాలని అంబులెన్స్ లో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందిందన్నారు . మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు .ఆమె మృతికి వివరాలు తెలియాల్సి ఉంది. గత రెండు నెలల నుండి పలు పత్రికల్లో పేడ రంగు ( విషం ) బ్యాండ్ చేయాలని వార్తలు ప్రచురించాయి. కానీ బేతంచర్ల మండలంలోని సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇంకా మండలం లోని మహి ళలు క్షణికావేషంలో పేడ రంగు ( కెమికల్ విషయం ) తాగి మృతి చెందుతారేమో అని మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు స్పందించి, పేడ రంగు ను నిషేధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
28- 07 - 2026

# రోడ్డు ప్రమాదంలో మహిళకు తలకు గాయం



**గాలివీడు మన జనప్రగతి జులై 27:-** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మల్లమ్మ అనే మహిళ రోడ్డు దాటు తుండగా గేటు వైపు నుండి బస్టాండ్ వైపుకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో మహిళ తలకు గాయమైంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పంది ంచి ఆమెను గాలివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మహిళ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం..

## నిత్య పూజయ్యకోన ఆలయంలో మహిళలకు మౌలిక వసతులు కల్పించాలి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 27:** -సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లి సమీప లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర కోన ఆలయంలో మహిళా భక్తులకు కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ఆలయ ప్రాంగణంలో మహిళలకు టాయిలెట్లు, స్నానపు గదు లు, బాత్రూమ్‌లు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక ఇబ్బం దులు పడుతున్నట్లు వారు తెలిపారు. పంచలింగాల గుడి సమీపంలో మాట్లాడిన మహిళా భక్తులు, ఆలయానికి లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ఎండోమెంట్స్ శాఖ అధికారులు మహి ళలకు అవసరమైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహి స్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మహిళా భక్తుల కోసం టాయిలెట్లు, స్నానపు గదులు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు.

## కూటమిపాలనలో అభివృద్ధి లక్ష్యంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి



**ఆదోని మన జనప్రగతి జులై 27:** -కూటమిపాలనలో అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని 243 భూత్ ఇంచార్జి శ్రీనివాసచారి అన్నారు. సోమవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా, ఆదోని మాజీ ఎమ్మెల్యే కే. మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు,ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ అభివృద్ధి, సంక్షేమం, ఏళ్ల నమ్మకం, కూటమి ప్రభుత్వం సంక్షేమం విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 256 భూత్ డిష్ ఈరన్న, 255 భూత్ ధర్మారవి, చాంద్, సంధ్యారాణి, రాందాస్, సుధ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ అభివృద్ధి

**- సంక్షేమం గడపగడపలో కూడా చైర్మన్,టిడిపి ఇంచార్జ్ ముక్కారూపానంద రెడ్డి**

**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 27:** -కూటమి ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమని టిడిపి ఇన్చార్జ్ కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి.అన్నారు సోమవారం ఓబులవారిపల్లి మండలంలోని చిన్న వరంపాడు.సి.ఓ కమ్మపల్లి గ్రామాలలో ఆయన సంక్షేమం మన ప్రభుత్వం అనే కార్యక్రమం పై గడప గడప తిరిగి ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించారు.అంతేకాకుండా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు మన సమస్యల పైన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఓటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలు అంచలంచెలుగా అభివృద్ధి జరిగిందన్నారు ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో లింకు రోడ్లు సిసి రోడ్లు అనేక మౌలిక వసతులు కల్పించారన్నారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మైనార్టీ నాయకులు ఓస్లీ సాహెబ్. ఆలీ కోడూరు మండల టిడిపి నాయకులు చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కావేటి పాండు కన్నుమూత

**● పులివెందులలో కావేటి పాండు భౌతికదేహానికి బీజేపీ నాయకుల ఘన నివాళులు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** భారతీయ జనతా పార్టీ కడప జిల్లా మాజీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కావేటి పాండు సోమవారం పులివెందుల లోని వారి స్వగ్రాహం నందు స్వర్గస్తులయ్యారు.ఆయన ఆకస్మిక మరణం పట్ల బీజేపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.కావేటి పాండు భౌతిక దేహానికి మాజీ సెంట్రల్ పీఎస్ రైల్వే మెంబర్ తలుపుల గంగాధర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తలుపుల గంగాధర్ మాట్లాడుతూ కావేటి పాండు బీజేపీ సిద్ధాంతాలకు నిబద్ధుడై పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు.జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారని,గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని విస్తరించడంతో పాటు గిరిజన సమాజ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించారని గుర్తుచేసుకున్నారు.పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వర్తించి కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని,ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడిమూడి శ్రీరాములు మాట్లాడుతూ కావేటి పాండు అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ కార్యకర్తలను కలుపుకుని ముందుకు నడిపించే తత్వం ఉన్న నాయకుడని పేర్కొన్నారు.పులివెందుల మండల అధ్యక్షుడు వై.నవీన్ మాట్లాడుతూ కావేటి పాండు ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ,పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పులివెందులలో 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రారంభం

**● ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**

**● తుంగభద్ర ప్రాజెక్టు హెచ్ఎల్సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఫిజియోథెరపీ సాయి కిషోర్ క్లినిక్ వద్ద నుంచి ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమాన్ని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటామని,వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,టీడీపీ పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి,తూగుట్ల మధుసూదన్ రెడ్డి,మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దురు వెంకట్రామిరెడ్డి,నల్లాగారి భాస్కర్ రెడ్డి,ఎర్ర జగదీష్ రెడ్డి,ఫిజియోథెరపి సాయి కిషోర్,లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరుస్తాం..

**● గొందిపల్లెలో "టీడీపీ ఇంటింటికీ" కార్యక్రమం**

**● ప్రజలకు కరపత్రాల పంపిణీ**



**వేముల మన జనప్రగతి జూలై 27:** -ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి అన్నారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు సోమవారం సాయంత్రం వేముల మండలంలోని గొందిపల్లె గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చిట్టిబోయిన బ్రహ్మయ్య, పార్టీ సీనియర్ నాయకుడు పేర్ల శేషారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించి, వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పేర్ల పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ భాగంగా ఇప్పటికే పలు హామీలు అమలయ్యాయని, మిగిలిన పథకాలను కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని త్వరలో అమలు చేస్తామని తెలిపారు.ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**● రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాము తనిఖీ**



**రాయచోటి మన జనప్రగతి జూలై 27 :-** ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మాసవారీ తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ లో అంతర్భాగాలను రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ ఏ. శ్రీనివాస్, ఎలక్షన్ విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై పోరుబాట

**● జులై 28న కడపలో విద్యార్థి,యువత నిరసన ర్యాలీ**

**● జయప్రదం చేయాలని వైఎస్ మనోహర్ రెడ్డి పిలుపు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:-** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థులు,యువత పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు,డీఎస్సీలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ ఈ నెల 28న కడప నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు.ఈ ర్యాలీకి సంబంధించిన కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ముఖ్య నాయకులతో కలిసి పులివెందుల వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి,కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో విద్యార్థులు,నిరుద్యోగ యువత తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని,వారి హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, విద్యార్థి మరియు యువజన విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి

**● పులివెందుల పోలీసుల అవగాహన సదస్సు**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పులివెందుల పట్టణంలోని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు మరియు యజమానులకు రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పులివెందుల డిఎస్పీ బుక్కే మురళి,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఎస్పీ బుక్కే మురళి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతీ పౌరుడి బాధ్యత అని,వీటిని ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని,కేటాయించిన ఆటో స్టాండ్లలోనే వాహనాలను నిలపాలని స్పష్టం చేశారు.స్కూల్ విద్యార్థులతో వెళ్లేటప్పుడు ఆటో డ్రైవర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలకే కాక,ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.ప్రయాణికులు పొరపాటున ఆటోలలో వదిలేసిన విలువైన ఆభరణాలు,నగదును వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించి తమ నిజాయితీని చాటుకోవాలని కోరారు.మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని,వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.పులివెందుల పట్టణం ప్రస్తుతం పూర్తి సీసీ కెమెరాల నిఘా నీడలో ఉందని,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని డిఎస్పీ తెలిపారు.జీరో ప్రమాదాలే పులివెందుల పోలీసుల లక్ష్యం అని,ఈ లక్ష్య సాధనకు వాహన చోదకులు,ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు.ఎంవీఐ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ వాహన డ్రైవర్ ఆర్.సి,డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్,ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరియు పొల్యూషన్ సర్టిఫికేట్లను తప్పనిసరిగా కలిగి ఉండాలని,వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమం లో పులివెందుల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాదరావు డ్రైవర్లకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.తాగి వాహనం నడపరాదని,అతి వేగంతో ప్రయాణించకూడదని, పరిమితికి మించి లోడ్ ప్రయాణికులను తీసుకెళ్లకూడదని,డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడరాదని,ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,కార్ల డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలని,రోడ్లపై రాంగ్ పార్కింగ్,రాంగ్ రూట్ ప్రయాణాలు చేయరాదని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలాగే ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయరాదన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర్ రెడ్డి మరియు సిబ్బంది,ఆటో యూనియన్ నాయకులు,పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు,యజమానులు పాల్గొన్నారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
28- 07 - 2026

# పులివెందుల సమస్యల పరిష్కారానికే ఇంటింటి ప్రచారం

● మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామ్‌రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలల 15 రోజులు పూర్తయిన సందర్భంగా పార్టీ ఆదేశాల మేరకు 45 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామ్‌రెడ్డి తెలిపారు.సోమవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని సాయి కిషోర్ క్లీనిక్ వద్ద నుంచి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమశీలో తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డితో పాటు స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పులివెందులలో అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ 45 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇల్లు తిరిగి సమస్యలను తెలుసుకుని,అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఇంటింటికీ వెళ్తున్న సమయంలో రూ.4,000 పెన్షన్ అందుతుండటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని,సంక్షేమం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికలలో పనిచేసే ప్రతినిధులను మాత్రమే ఎన్నుకోవాలని పులివెందుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ మార్పు మున్సిపాలిటీ నుంచే ప్రారంభమై,రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికలలో నియోజకవర్గంలో టీడీపీ విజయానికి నాంది కావాలని ఆకాంక్షించారు.

# ఇంటింటా సంక్షేమ పథకాల ప్రచారం చేపట్టిన టీడీపీ శ్రేణులు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 27:**-రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధవటం మండలం మాచుపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు బూత్ నంబర్లు 5, 6, 7 పరిధిలో మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని అన్నారు. శ్రీశక్తి, తల్లికి వందనం, రైతు భరోసా, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీపీ రామిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బూత్ ఇన్‌చార్జులు మల్లు రమణారెడ్డి, పిచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లు విజయభాస్కర్ రెడ్డి, కో-కన్వీనర్ వేణుగోపాల్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# యువత అన్ని రంగాల్లో రాణించాలి:సిపిఐ



**ఆస్పరి మన జన ప్రగతి జులై 27:**-ఇటీవల జరిగిన విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగం విజయవంతంలో కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన ఇంజినీర్ గా పనిచేస్తున్నటువంటి జనార్ధన్ ని ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందినటువంటి గ్రామ సర్పంచ్ అయిన కౌలుట్లయ్య కుమారుడు జనార్ధన్ ఈరోజు విక్రమ్ రాకెట్ ప్రయోగం విజయవంతంలో భాగస్వాములు కావడం అభినందనీయం అని అన్నారు. 2020 నుండి ఏఎంపిలలోనే విధులు నిర్వహిస్తూ అతడు అంతరిక్ష ప్రయోగం మిషన్ అంగమాన్ విక్రమ్-1 లో కీలక పాత్ర పోషించి గ్రామానికి తల్లిదండ్రులకు పేరు తెచ్చాడు. అని అయన అన్నారు. మరియు స్కైర్ రూట్ ఏరోస్పేస్ లో ఇంటికేషన్ టెస్ట్ ఇంజనీర్ టీం లీడర్ గా పనిచేస్తున్నారు. ఈ దేశానికి యువత వెన్నుముక లాంటి వారు కావున ప్రతి ఒక్కరు జనార్దన్ ని ఆదర్శంగా తీసుకొని యువత పక్కదారి పట్టకుండ ప్రతి రంగంలోనూ విజయాలు సాధించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కౌలుట్లయ్య సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి సహాయ కార్యదర్శి రమేష్ రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు అంజినయ్య నాయకులు వీరేష్ ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేవైసీ పూర్తి చేయకుంటే గ్యాస్ రీఫిల్ బుకింగ్ నిలిపివేత

- శ్రీ సాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఇకపై గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియ నిలిపివేయబడుతుందని స్థానిక శ్రీ సాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.గ్యాస్ కనెక్షన్ కలిగిన అసలు వినియోగదారుడు మరణించి ఉంటే,వారి కుటుంబ సభ్యులు లేదా వారసులు తమ పేరు మీదకు ఆ కనెక్షన్‌ను బదిలీ (మార్చుకొని) చేయించుకుని, కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.అర్హులైన వినియోగదారులు పులివెందులలోని నారాయణ కాలేజ్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న శ్రీ సాయి హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి వచ్చి వెంటనే కేవైసీ నమోదు చేసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరారు.కేవైసీ కు ఆధార్ కార్డు,గ్యాస్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకురావాల్సిఉంట్టుందన్నారు.వినియోగదారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండటానికి వీలైనంత త్వరగా గ్యాస్ ఆఫీస్‌కు వచ్చి కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని శ్రీ సాయి హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# ఇంటింటికీ తెలుగుదేశం.. సమస్యల పరిష్కారమే ధ్యేయం: తూగుట్ల మధుసూదన్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:**'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తో పాటు స్థానిక టిడిపి నాయకులతో కలిసి పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్న తీరుపై హర్షం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోందని,ముఖ్యంగా పెన్షన్ల పంపిణీ మరియు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం పట్ల ప్రజలుసంతోషంగా ఉన్నారని తెలిపారు.స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఉన్న చిన్న చిన్న డ్రైనేజీ మరియు తాగునీటి సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.పులివెందుల ప్రాంతంలో స్థానిక సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించేలా నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ఐటీ సీట్ సాధించిన మోహిత్ రాయల్

- అంధుల ఆశ్రమంలో ఘనంగా అన్నదానం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** స్థానిక కచేరీ రోడ్డులోని గీత మందిరం పక్కన ఉన్న శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో సోమవారం ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.పులివెందుల రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్,స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్.ఆర్ఎస్ఎస్ తన కుమారుడు మోహిత్ రాయల్ ఒరిస్సాలోని ప్రతిష్ఠాత్మక ఎన్ఐటీ(నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) రూర్కేలాలో సీటు సాధించిన శుభ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రపాణి మరియు జర్నలిజం రంగంలో సీనియర్ ప్రతినిధి,డాక్టర్.ఆర్ఎస్ఎస్ గురువులైన అల్లం రంగనాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.డాక్టర్ చక్రపాణి ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని,అన్నదానం అన్ని దానాల్లోకెల్లా మిక్కిలి శ్రేష్టమైనదని కొనియాడారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో ఆపన్నులకు,దివ్యాంగులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో సీటు సాధించిన మోహిత్ రాయల్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్‌తో డాక్టర్.ఆర్ఎస్ఎస్ మాట్లాడుతూ త్వరలోనే ఆశ్రమంలోని నివాసితులకు నూతన దుస్తులు మరియు బెడ్‌షీట్లను వితరణగా అందజేస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడు సమాజానికి సేవ చేయడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు,స్థానిక ప్రముఖులు,ఆశ్రమవాసులు తదితరులు పాల్గొని మోహిత్ రాయల్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

# డీఎస్సీ వివాదం..లోకేష్ రాజీనామా చేయాలి..!

● వేముల మండల వైకాపా కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డి

● నైతిక బాధ్యత వహించాలన్న జడ్పీటీసీ కోకటం వెంకట బయపిరెడ్డి

● వేములలో వైకాపా నేతల మీడియా సమావేశం




**వేముల మన జనప్రగతి జూలై 27:** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షల నిర్వహణపై వెలువడుతున్న ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ వేముల మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డి, వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం వేముల మండల కేంద్రంలోని వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో,రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్నాయని ఆరోపణలు వస్తున్న అవకతవకలపై కూడా ప్రభుత్వం అదే నైతిక ప్రమాణాలను పాటించాలని అన్నారు.డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీలు జరిగాయంటూ అనేక ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిపై సమగ్రంగా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు." కేంద్రంలో ఒక విధంగా, రాష్ట్రంలో మరో విధంగా వ్యవహరించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందీ" అని పేర్కొన్నారు.డీఎస్సీ పరీక్షలకు సిద్ధమైన వేలాది మంది నిరుద్యోగ యువత తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పరీక్షల నిర్వహణపై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.ఈ వ్యవహారంపై సీబీఐ లేదా పూర్తిగా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించి నిజానిజాలను ప్రజల ముందుంచాలని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షా వ్యవస్థపై అభ్యర్థులకు పూర్తి విశ్వాసం కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు,పార్టీ కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శీతల గంగమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 27:**-సిద్ధవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వచ్చే బుధ, గురువారాల్లో నిర్వహించనున్న జాతరను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంతో పాటు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. జాతీయ రహదారి వెంట వివిధ వేషధారణలతో ఆకర్షణీయమైన లైటింగ్ కటౌట్లు ఏర్పాటు చేస్తుండగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఆలయ గర్భగుడికి పెయింటింగ్ పనులు, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ అలంకరణలు వేగంగా కొనసాగుతున్నాయి. జాతర మహోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని ఏర్పాట్లను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తూ పూర్తి చేస్తున్నారు.


# జూలై 29,30న జిల్లాలో విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పర్యటన: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 27:**-మానవ వనరుల అభివృద్ధి (విద్య), సమాచార సాంకేతికత (ఐటీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) శాఖల మంత్రి నారా లోకేష్ ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 29 న ఆదోని, 30 వ తేదీన పత్తికొండ మండలాల్లో మంత్రి పర్యటన ఉన్నందున సంబంధించిన శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు సందర్శించే అవకాశం ఉన్నందున ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో అధికారికంగా పర్యటన వివరాలు వెలువడుతాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి

- ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 27:-** ఓబులవారిపల్లి లో పనిచేస్తున్నటువంటి శాఖా పరమైన మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు శాఖా పరమైన సమస్యలు పరిష్కరించాలన్నారు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు అంతేకాకుండా భూమి ఆన్లైన్ ఆధార్ కార్డు లింక్ కొటేషన్ భూమి కొలతలు తదితర సమస్యల పరిష్కారానికి కొన్ని అర్జీలు అన్యాయన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్ఐ మల్లికార్జున రెడ్డి వీఆర్వోలు పాల్గొన్నారు

# టౌన్ క్లబ్‌లో అక్రమాలపై విచారణ చేపట్టాలి: సభ్యుల వినతి



**తిరుపతి, మన జనప్రగతి జూలై 27 :-** తిరుపతి సోషల్ అండ్ కల్చరల్ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి, 2018 నుంచి కొనసాగుతున్న అడహాక్ కమిటీని రద్దు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని క్లబ్ శాశ్వత సభ్యులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు.క్లబ్ సభ్యులు రాతికొండ రవి, జెడబ్ల్యూ విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ, 2018 నుంచి ఎన్నికలు నిర్వహించకుండా అడహాక్ కమిటీ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. క్లబ్ నిధుల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయని, ఇందుకు సంబంధించిన ఆధారాలను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు.క్లబ్ ఖాతాలను ఫ్రీజ్ చేసి ప్రత్యేక అధికారి పాలన ఏర్పాటు చేయాలని కోరగా, పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సభ్యులు వెల్లడించారు.

మనజనప్రగతి

28- 07 - 2026

# పీజీఆర్ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయాల సేకరణకు క్యూఆర్ కోడ్ వినియోగించండి

• ఎంపీడీఓ యస్.గౌస్ భాష






**వీరబల్లి మన జనప్రగతి జూలై 27:-** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ను ప్రజలు తప్పనిసరిగా వినియోగించాలని ఎంపీడీఓ, యస్.గౌస్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ సమావేశాలకు హాజరయ్యే ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌ను తమ మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసి, అందించిన సేవలపై తమ విలువైన అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు.ప్రజల నుండి అందే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల పీజీఆర్ఎస్ కేంద్రాలు, కలెక్టరేట్, మండల కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, నోటీస్ బోర్డులు, హెల్ప్ డెస్కులు, ఫిర్యాదు కౌంటర్లు మరియు ఇతర ప్రజా ప్రదేశాల్లో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు.కావునా మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# అబ్దుల్ కలాం జీవితం అందరికీ స్ఫూర్తి దాయకం: మాజీ ఎంపీ డాక్టర్ తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 27:-** భారత మాజీ రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహుడు, భారతరత్న స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం జీవన విధానం అందరికీ స్ఫూర్తి దాయకం.. ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. వేంపల్లి లో సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అని అబ్దుల్ కలాం ఇచ్చిన అమర సందేశం యువతకు తారకమంత్రంగా పని చేసిందన్నారు. ఆయన నిత్య విద్యార్థి అని అందుకే ఆయన జన్మదినమైన అక్టోబర్ 15 ను ఐక్యరాజ్యసమితి ప్రపంచ విద్యార్థి దినంగా ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు .స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు అసామాన్యుడు కాగలడని,రామేశ్వరం నుండి రాష్ట్రపతి భవన్ వరకు పోగలడని, ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని అబ్దుల్ కలాం నిరూపించారన్నారు. అందుకే ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదా యకం అన్నారు. కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,,బద్రి,ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31న కలెక్టరేట్ ముందు అంగన్వాడీల మహాధర్నా



**పత్తికొండ మన జనప్రగతి జులై 27:-** సిడిపిఓ లలితకు వినతి పత్రం అందించిన సిఐటియు అంగన్వాడి హెల్పర్ నాయకురాలు అంజనమ్మఈనెల 31న కలెక్టరేట్ ముందు అంగన్వాడీల మహా ధర్నాకు హెల్పర్స్ అత్యధిక సంఖ్యలో పాల్గొని జాతర చేయాలని సిఐటియు అనుబంధ అంగన్వాడి ఏర్పడి యూనియన్ కార్యదర్శి అంజనమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నందు సిడిపిఓ లలితకు వ్యతిపత్రం అందించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్క రాష్ట్రాల్లో కనీస వేతనం పెంచుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం దాని పైన దృష్టి సారించడం లేదని నిత్యవసర వస్తువులు జరుగుతున్న శాలీచాలని జీతాలతో కాలం నేట్టుకు రావడం పెద్ద సమస్య అయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం కొరకు గత ప్రభుత్వం నుండి కూడా ధర్నాలు నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వాలకు మాత్రం కనికరం రావటం లేదని పని భారం మాత్రం ప్రభుత్వాలు పెంచుతూనే ఉన్నారని అనేక యాపులు పెట్టి అంగన్వాడీలపై పనిభారం పెంచుతున్నారే తప్ప కనీస వేతనం మాత్రం పెంచడం లేదని తక్షణమే కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు డి గోపాల్, రమాదేవి, షాహిదా బేగం, అంబికా, రెహనాభి, జై విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ నేతలు

- సిద్ధవటం మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 27:-** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం సోమవారం సిద్ధవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ గంగానగర్ గ్రామంలో 27, 29 బూతుల పరిధిలో నిర్వహించారు. టిడిపి రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజా నాయుడు, పందిపాటి బాలకృష్ణ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకొని పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజా సంక్షేమాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

• ప్రజల వద్దకే ప్రభుత్వం,ప్రతి ఇంటికి సంక్షేమం.




**వేంపల్లె మన జనప్రగతి జూలై 27:-** ప్రజా సంక్షేమం, అభివృద్ధే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ సింగారెడ్డి రామ మునిరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ లు పేర్కొన్నారు. సోమవారం వేంపల్లి పట్టణంలో ప్రజల వద్దకు ప్రభుత్వం, ప్రతి ఇంటికి సంక్షేమం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే స్థానికంగా ఉన్న వివిధ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ప్రజా పరిపాలన ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పులివెందుల ఇంచార్జ్ బిటెక్ రవి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు టీడీపీ నాయకులు వివరించారు. ప్రజా రంజక పాలన పట్ల ప్రజల నుంచి సంతోషం వ్యక్తం అవుతోందని, ఇది మంచి ప్రభుత్వం అనేందుకు ప్రజల స్పందనే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల మైనారిటీ కన్వీనర్ తెలంగాణ వలి, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా, టిడిపి యూనిట్ సభ్యులు జబిబుల్లా, డక్కా రమేష్, టీడీపీ నాయకులు పివి రమణ, తిప్పారెడ్డి, మోహన్ రెడ్డి, కటిక నాగరాజు, సీఎస్ ఖాజా, మాబు షరీఫ్, తక్కెలపల్లె షరీఫ్, పీరా, యాసిన్, పూల అల్లా బకష్, రామచంద్ర, గండికోట శివ, ఇస్మాయిల్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి

• విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

• 28న జరిగే నిరసన ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

• వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 27:-** రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, దీనిపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భాకరాపేటలోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో డీఎస్సీపై హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకాలను అవినీతి, అక్రమాలకు వేదికగా మార్చిందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ప్రత్యేక జీవోల ద్వారా అక్రమాలకు పాల్పడి అనంతరం వాటిని రద్దు చేశారని విమర్శించారు. డీఎస్సీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో ప్రభుత్వం విఫలమై వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలిగించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై జూలై 28న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన ర్యాలీలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా 52 లక్షల రూపాయలు: తల్లుల ఖాతాల్లో జమ




**గాలివీడు మన జనప్రగతి జులై 27:-** గాలి వీడు మండలం నూలివీడు గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ యాజమాన్యం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నూలివీడు గ్రామ పరిధిలోని విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా 52 లక్షల రూపాయలు విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమ కావడం జరిగింది. తల్లికి వందనా నికి కారుకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి , విద్యా శాఖ మంత్రి లోకేష్ కు మరియు రాష్ట్ర రవాణా ,క్రీడ, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చిత్రపటాలకు విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ కలిసి పాలాభిషేకం చేశారు అని వారు తెలిపారు...

# మెగా డీఎస్సీపై ఆరోపణలు కాదు రుజువులు చూపించాలి: మంత్రి సవిత



**గిద్దలూరు మన జనప్రగతి జూలై 27 :-** మెగా డీఎస్సీపై ఆరోపణలు చేయడం కాకుండా వాటికి రుజువులు చూపించాలని మాజీ సీఎం జగన్‌కు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు. చర్చకు రావాలని పిలిచినా జగన్ ముఖం చాటేస్తున్నారని విమర్శించారు.గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి లిఇంటింటికీ తెలుగుదేశంలి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు పెన్షన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.జగన్ హయాంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు. బీసీ గర్జన పేరుతో వైసీపీ మరో రాజకీయ డ్రామా చేస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మరోసారి గుణపాఠం చెబుతారని మంత్రి సవిత అన్నారు.అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# ఐదేళ్లుగా నిరంతరంగా శివోహం ఉచిత అన్నప్రసాద సేవ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 27:-** శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా కొనసాగుతున్న ఉచిత అన్నప్రసాద సేవకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శివోహం కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా వద్ది లక్ష్మి నరసయ్య భక్తులకు రామేశ్వరం స్వీట్ పంపిణీ చేశారు. సుమారు 6 వందల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరిస్తున్న దాతలు, కమిటీ సభ్యులకు రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు రమేష్ రెడ్డి, మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, జగన్, విష్ణునారాయణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉత్తమ ప్రతిభ కనబరిచాలి

- జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విధ్యార్థులు




**వేంపల్లె మన జనప్రగతి జూలై 27:-** విధ్యార్థులు క్రీడల్లో రానించి ఉత్తమ ప్రతిభ కనబరిచాలని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసుల రెడ్డి అన్నారు. సోమవారం ఆ పాఠశాలకు చెందిన విధ్యార్థులు అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటిల్లో జిల్లా స్థాయి కి ఎంపికయ్యారు. అండర్ -17 వాలీబాల్ ఎంపిక ట్రైల్స్ లో వి.గురు చరణ్, పి.విష్ణు చరణ్, బి.అజయ్, ఎస్.యాకూబ్, పి.నాయబ్ రసూల్, అలాగే లాంగ్ జంప్ విభాగంలో ఎల్.ఆనంద్ జిల్లాస్థాయి పోటిలకు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రతిభకు కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు నిషాల్, ప్రమీల కుమారి లను హెచ్ఎం అభినందించారు.

# క్రీడలలో సత్తాచాటిన చిట్వేలి విద్యార్థులు



**చిట్వేలి మన జనప్రగతి జూలై 27:-** జాతీయ క్రీడా దినోత్సవం2026 సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్2026లో భాగంగా తిరుపతి జిల్లాలో నియోజకవర్గ స్థాయి పోటీలలో చిట్వేలి పీ.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు సత్తా చాటారు.పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్2026 ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలియజేశారు.నియోజకవర్గస్థాయిలో చెన్నరాజుపోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన అండర్ -17 బాలుర విభాగంలో ఖో-ఖో నందు యస్.రామ్ చరణ్, బాలికల విభాగంలో ఏ. రమ్య , కే. దీక్ష అనే 9వ తరగతి విద్యార్థులు, బ్యాడ్మింటన్ నందు ఎస్. స్వర్ణాంజలి, జే. సుప్రియ, జే. బిందు ప్రియ అనే తొమ్మిదవ తరగతి విద్యార్థినిలు, వాలీబాల్ నందు కే. అఖిల్ నంద అనే 9వ తరగతి విద్యార్థి, కబడ్డీ నందు ఎస్. ఫర్హాన్ అనే పదవ తరగతి విద్యార్థి అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలియజేశారు.జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను మరియు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మనజనప్రగతి

28- 07 - 2026

# జాతరలా సైకిళ్ల పంపిణీ.. పేద విద్యార్థుల కలలకు చక్రాలు తొడిగిన మంత్రి నారాయణ కుటుంబం





**నెల్లూరు మన జనప్రగతి జూలై 27:-** "నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదుడ జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, కష్టాల్లో పెరిగి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివిన రోజులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. నా లాంటి కష్టాలు ఈ తరం పిల్లలకు ఉండకూడదనే ఉద్దేశంతోనే 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో ఉచిత సైకిళ్లు అందిస్తున్నాం" అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు.నెల్లూరు నగరంలోని వీఆర్సీ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జాతరను తలపించింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు మంత్రి నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసింది. వేలాది మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి తరలిరావడంతో వీఆర్సీ గ్రౌండ్, ట్రంక్ రోడ్డు ప్రాంతం జనసంద్రమైంది. "థాంక్యూ నారాయణ సార్" అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. తండ్రి ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి తెచ్చిన జీతంతో కుటుంబం గడిచేదని, అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని సంకల్పించుకున్నానని చెప్పారు. వీఆర్సీలో చదివానని, పదో తరగతిలో ఒకసారి విఫలమైనా పట్టుదలతో చదివి యూనివర్సిటీ ఫస్ట్ సాధించానని, అదే కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి, అనంతరం ప్రైవేట్ ట్యూషన్లతో జీవితంలో ఎదిగానని వివరించారు.ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లకు వెళ్లినప్పుడు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న పేద విద్యార్థుల పరిస్థితి తనను కలచివేసిందన్నారు. అందుకే వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని మాటిచ్చానని తెలిపారు. ఆ సంకల్పంలో భాగంగానే వీఆర్సీని రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకొచ్చామని, తన పిల్లలు స్వయంగా పర్యవేక్షించి విద్యాసంస్థను ఆధునీకరించారని చెప్పారు. ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించామని వెల్లడించారు.అదే స్ఫూర్తితో నగరంలోని మరో 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను దాతల సహకారంతో ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్విమ్మింగ్ పూల్‌తో నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తనలాగా కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులతో చర్చించి 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.6 కోట్లతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తొలి విడతగా 7 వేల సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని, మిగిలిన 3 వేల సైకిళ్లను జనవరిలో అందజేస్తామని చెప్పారు."ఈ సైకిల్ కేవలం ఒక వాహనం కాదుడ మీ కలలకు చక్రాలు. మీ భవిష్యత్తుకు దారి. మీ తల్లిదండ్రుల ఆశలకు బలం. ఒక కుటుంబానికి డబ్బు ఇస్తే కొంతకాలమే ఉపయోగపడుతుంది. కానీ విద్య ఇస్తే తరతరాల భవిష్యత్తు మారుతుంది. నేను ఆస్తులు పంచడం లేదుడ విద్య అనే శాశ్వత ఆస్తిని పంచుతున్నాను" అని మంత్రి భావోద్వేగంగా అన్నారు.విద్యార్థులంతా బాగా చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు తన సొంత నిధులను కూడా పేదల కోసం ఖర్చు చేస్తున్నానని తెలిపారు.మంత్రి కుమార్తె పొంగూరు సింధుర మాట్లాడుతూ, తన తండ్రి సాధారణ కుటుంబం నుంచి వచ్చి మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లి చదువుకున్నారని గుర్తుచేశారు. తనలాంటి కష్టాలు పేద పిల్లలకు రాకూడదనే ఉద్దేశంతోనే 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో తామూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని తెలిపారు.మరో కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ, నెల్లూరులోని మున్సిపల్ పాఠశాలలను ఆధునీకరించడం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్నదే తమ తండ్రి లక్ష్యమన్నారు. వీఆర్సీని ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దారని, రెండో విడతలో మరో 3 వేల సైకిళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, పీ-4 కార్యక్రమం సమాజంలో సానుకూల మార్పు తీసుకొస్తోందన్నారు. మంత్రి నారాయణ చేపడుతున్న సేవా కార్యక్రమాలు పేద విద్యార్థులను సాధికారత వైపు నడిపిస్తున్నాయని కొనియాడారు. ముఖ్యంగా బాలికలకు సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని, వారి ఉన్నత విద్యకు ఇవి దోహదపడతాయని చెప్పారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, బాల్యంలో ఎదుర్కొన్న కష్టాలు ఇతర పిల్లలకు రాకూడదనే గొప్ప ఆలోచనతో మంత్రి నారాయణ కుటుంబం చరిత్రలో నిలిచిపోయేలా 10 వేల సైకిళ్లు పంపిణీ చేస్తోందన్నారు. నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని తన భుజాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారని అభినందించారు.మేయర్ పొట్లూరి సుజాత మాట్లాడుతూ, మంత్రి నారాయణలాంటి వ్యక్తి నెల్లూరుకు దొరకడం అదృష్టమన్నారు. ఒకే రోజు 7 వేల సైకిళ్లను సొంత నిధులతో పంపిణీ చేయడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు.నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో సైకిళ్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ ఘనత గిన్నిస్ బుక్‌లో నమోదు కావాల్సిన రికార్డని అభిప్రాయపడ్డారు.రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ ప్రాంతానికి 2,500 సైకిళ్లు కేటాయించినందుకు మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, కార్పొరేట్ స్థాయి విద్యను పేద విద్యార్థులకు ఉచితంగా అందించాలన్న మంత్రి సంకల్పం అభినందనీయమన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, పునీత్, గంటా రవితేజ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, సంతపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్‌పర్సన్ విజేతా రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నాయకులు జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు, కిన్నెర మాల్యాద్రి, మొయినుద్దీన్, కర్తం ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి ఏపీ కట్టుబడి ఉంది: మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం,మన జనప్రగతి జూలై 27 :-** రాష్ట్రాన్ని క్రియేటివ్ ఎకానమీ, వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ) అధికారిక లోగో, పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, పాన్ ఇండియా సినిమాలు, ఓటీటీలతో భాషా సరిహద్దులు చెరిగిపోయాయని, లి"వన్ ఇండియా - వన్ సినిమా"లి లక్ష్యంతో ఎఫ్‌టీపీసీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఎఫ్‌టీపీసీ చేపట్టే సినీ, టెలివిజన్, థియేటర్ అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని విధాలా తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, జయ పటేరియా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత

### జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా



**కడప,మన జనప్రగతి జూలై 27:-**ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, ప్రజల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, పొంతనలేని నివేదికలు సమర్పించకుండా వాస్తవ సమాచారంతోనే నివేదికలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు సులభంగా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా కనిపించే ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అందించే ప్రతి స్పందన అధికారిక పీజీఆర్ఎస్ వ్యవస్థకు చేరి సేవల మెరుగుదలకు ఉపయోగపడు తుందని, ప్రజల సూచనలు ప్రభుత్వానికి విలువైనవన్నారు.అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్డీసి వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు జాన్ ఇర్విన్, రంగస్వామి, శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ అనురాధ, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు

## విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల కోసం నేడు నిరసన ర్యాలీ

- కడపలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం
- పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చల్లా సునీల్ కుమార్ పిలుపు



**వేముల మన జనప్రగతి జూలై 27:-**విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం, డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై నిరసన వ్యక్తం చేస్తూ నేడు కడపలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా యువజన విభాగం కార్యనిర్వహక సభ్యుడు చల్లా సునీల్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా నిరాశపరిచిందని విమర్శించారు.డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, క్రీడా కోటా అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు, యువత, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చల్లా సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రానికే స్ఫూర్తిగా "స్టార్ట్ అప్ కడప"

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ పనుల పురోగతిపై సమీక్ష



**కడప,మన జనప్రగతి జూలై 27:-** యువతలో ఆవిష్కరణలు, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించి, ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్మిస్తున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో.. పి-4 విధానం ద్వారా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న "స్టార్ట్ అప్ కడప" నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన తో కలిసి సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. "ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్ట్ అప్" అనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా జిల్లా యంత్రాంగం వినూత్నంగా ఈ కేంద్రాన్ని రూపొందిస్తోందన్నారు. యువతలో సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందిస్తూ, కొత్త వ్యాపారాలకు మార్గనిర్దేశం చేసే కేంద్రంగా ఇది రూపుదిద్దుకుంటోందని చెప్పారు.అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, కో-వర్కింగ్ స్పేస్‌లు, శిక్షణా కేంద్రాలు, సమావేశ మందిరాలు, వ్యాపార సలహా సేవలు వంటి అన్ని మౌలిక వసతులతో నిర్మితమవుతున్న ఈ కేంద్రం ద్వారా స్టార్ట్ అప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు ఒకే వేదికపై అవసరమైన సహకారం అందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో కడప జిల్లా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఎదిగే అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు.నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఫినిషింగ్ పనులు, గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్ణీత గడువులోపు అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో కడప నగర పాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, కాంట్రాక్టర్లు, ప్రాజెక్ట్ డిజైనర్లు, ఎడిపి యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఆటోలతో మెరుగైన పారిశుధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ: మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం మన జనప్రగతి జూలై 27:-** తూర్పుగోదావరి జిల్లాలో ఘన వ్యర్థాలసేకరణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 44 ఈ-ఆటోల కేటాయింపు ఈ-ఆటోలను పంచాయితీలకు పంపిణీ చేసి జెండా ఊపి ప్రాంభించిన మంత్రి కందుల దుర్గేష్తూర్పు గోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి నుండి చెత్త సేకరణ ప్రక్రియలను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 44 విద్యుత్ తో నడిచే ఈ- ఆటోలను మంజూరు చేసింది. ఒక్కొక్కటి 3,18,400 రూపాయలు చొప్పున 1,40,09,600 రూపాయల విలువైన 44 ఇ-ఆటోలు తూర్పు గోదావరి జిల్లాకు మంజూరు అయ్యాయి. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ లతో కలిసి జిల్లాలోని 11 మండలాల పరిధిలోని 37 గ్రామ పంచాయతీలకు ఈ-ఆటోలను పంపిణీచేసి జెండా ఊపి వాటిని ప్రాంభించారు. అనంతరం మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఈ- ఆటోలను స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. రాష్ట్రంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం అన్ని గ్రామాలు, పట్టణాల్లో చురుగ్గా సాగుతోందని మంత్రి



కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. 2047 నాటికి కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్' స్ఫూర్తితో స్వర్ణాంధ్రప్రదేశ్ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 1,40,09,600 రూపాయల వ్యయంతో 44 ఈ-ఆటోలను పంపిణీ చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. వీటిని నియోజకవర్గాల వారీగా రాజమహేంద్రవరం రూరల్ కు 12 , రాజానగరం కు 7, మండపేట కు 4, కొవ్వూరుకు 9, నిడదవోలు కు 8, గోపాలపురం కు 4 కేటాయించడం జరిగిందన్నారు. కాలుష్య నివారణతో పాటు ఆటోలు నడిపే కార్మికులకు లాభదాయకంగా ఉండేలా పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా ఈ-ఆటోలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేసారు. ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి మరియు హానికరమైన చెత్తను వేరుచేయడానికి వీలుగా ఈ ఆటోల్లో ఆరు ప్రత్యేక డబ్బాలను సైతం ఏర్పాటు




చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన వాహనాలు సరైన నిర్వహణ లేక మూలనపడిన పరిస్థితి తిరిగి తలెత్తకుండా ప్రస్తుత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ-ఆటోల నిర్వహణలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే తక్షణం పరిష్కరించేందుకు కుప్పం నియోజకవర్గంలో 10 మంది టెక్నోక్రాట్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని అందుబాటులో ఉంచారని, అవసరమైతే విజయవాడకు చెందిన సాంకేతిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకుంటామని వెల్లడించారు. ద

దీనికి తోడు జల వనరుల కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి కర్మాగారాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల పూర్తిస్థాయి భాగస్వామ్యంతోనే ఈ స్వచ్ఛతా కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రజలందరూ అవగాహన పెంచుకుని సహకరించాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్, డిపిఓ వి. శాంతామణి, ఆయా పంచాయితీల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# చెరువు పై చోటా నాయకుల ఆధిపత్యానికి గండి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 27:-**జిల్లాలో అతిపెద్ద చెరువు అయిన చిట్వేలి మండలం లోని యల్లమరాజు చెరువుపై చెర్లోపల్లికి చెందిన చోట రాజకీయ నాయకులు పెత్తనం చెలాయిస్తూ చేపల వేట జీవనధారంగా జీవిస్తున్న యానాధులను చెరువులోకి దిగనీయలేదు. చిన్న చేపలు కేజీకి 150 రూపాయిలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న చేపలకు అంత ధర అన్యాయం అంటూ దూర ప్రాంతాల నుండి చేపలు తెచ్చేవారు 100,120 రూపాయిలకు ఇంటి దగ్గరకొచ్చి అమ్ముతుంటే మీరు ఇంత రేటు పెట్టడం అన్యామని చేపలు కొనేవారు వ్యతిరేకించారు. చేపల రేటుపై రెచ్చిపోయిన నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తూ వాట్సాప్ గ్రూప్ ల్లో పోస్ట్ చేయడం తో దీనిపై మండల విలేకరులు లోతుగా విచారణ చేయడంతో అసలు చెరువు పై ఎవ్వరికీ ఎలాంటి అనుమతులు లేవని తెలిసింది. నాయకులు మాత్రం తాము అధికారులకు, సొసైటీ వారికి డబ్బులు కట్టాం, చేప పిల్లలు వదిలాం, ఇప్పటివరకు మాకు 18లక్షలు ఖర్చు అయింది అందుకే ఎక్కువ రేటు పెట్టాం అంటూ చిందులు వేశారు. మరోవైపు ఎం. రాచపల్లి ఎస్టీ, గట్టుమీద పల్లి ఎస్టీ, రాజారెడ్డి ఎస్టీ కాలనీ వాసులు మాత్రం తాము చెరువు వద్దకు పోయి చేపలు పట్టడానికి చోటా రాజకీయ నాయకులు దౌర్జన్యం చేస్తూ చెరువు లోకి దిగనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై యానాదులు నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం తహసీల్దార్ నరసింహా రావు కు వినతిపత్రం అందచేశారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డిఈ వినోద్ ను వివరణ కోరగా ఆయన స్పందిస్తూ తాము ఎవ్వరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అలాగే చిట్వేలి తహసీల్దార్ నరసింహా రావు ను వివరణ కోరగా ఆయన స్పందిస్తూ తాము ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదని, దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదన్నారు.


# నూలివీడులో టీడీపీ డోర్ టు డోర్ ప్రచారం



**గాలివీడు మన జనప్రగతి జులై 27:-** గాలివీడు మండల పరిధిలోని స్థానిక నూలివీడులో టీడీపీ డోర్ టు డోర్ ప్రచారంటీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు, రాష్ట్ర నాయకులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మార్గదర్శకత్వంలో సోమవారం నాడు రాయచోటి నియోజకవర్గం, గాలివీడు మండలం, నూలివీడు క్లస్టర్ పరిధిలో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాలివీడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి నాయకత్వం వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆదేశించారు. నూలివీడు శివారెడ్డి, టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి, బూత్ ఇన్చార్జ్ అమర్నాథ్ రెడ్డి, అలాగే పలువురు టీడీపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. ఈ డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రజల ఆశీర్వాదంతో టీడీపీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు భరోసా ఇచ్చారు...

# శ్రీ కపిలేశ్వరస్వామివారికి వైభవంగా గ్రంధి పవిత్ర సమర్పణ.





**తిరుపతి మన జనప్రగతి జూలై 27:-** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి .ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణలు,మంగళవాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో శ్రీ కపిలేశ్వరస్వామివారిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించనున్నారు

# ఎస్బిఐ ద్వారా కోటి రూపాయల బీమా అందజేత: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 27:-** ఓర్వకల్లు మండలం నన్నూరు లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వై. ముకుంద ప్రియ కొద్ది రోజుల క్రిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నేపథ్యంలో ఆమె తన జీతభత్యాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా పొందుతూ ఉన్నందున, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ద్వారా వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయల బీమా చెక్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ద్వారా జీతాలు పొందుతున్న శాశ్వత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి రూపాయలు, సహజ మరణము అయితే 10 లక్షల రూపాయల బీమా సౌకర్యమును స్టేట్ బ్యాంక్ కలగజేస్తున్నదని తెలిపారు. బీమా పథకాల పట్ల అందరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. కర్నూలు ట్రెజరీ బ్రాంచ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భాస్కర వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు స్టేట్ బ్యాంకు ద్వారా జీతాలు పొందే సౌకర్యాన్ని వినియోగించుకోవడం వల్ల బీమా పొందవచ్చని తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ 22వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం

● అన్ని అజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



**మంగళగిరి/పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ 22వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం మంగళగిరిలోని అకాడమీ ప్రధాన కార్యాలయంలో గౌరవ చైర్మన్ ఫారూఖ్ షిబ్లీ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని అన్ని కీలక అంశాలపై సమగ్రంగా చర్చించి,బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులైన మైనారిటీ వెల్ఫేర్ సెక్రటరీ/కమిషనర్ చిత్తూరి శ్రీధర్, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ సెక్రటర జంపాని శివయ్య,ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్,బోర్డు సభ్యులు మెహబూబ్ బాషా మరియు ఉర్దూ అకాడమీ డైరెక్టర్/సెక్రటరీ మహమ్మద్ నిజాముద్దీన్ తదితరులు హాజరయ్యారు. ఉర్దూ భాషాభివృద్ధి,మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి, కంప్యూటర్ శిక్షణా కేంద్రాల బలోపేతం,ఉర్దూ గ్రంథాలయాల అభివృద్ధి, సేవా నియమావళి,కారుణ్య నియామకాలు,సాహిత్య ప్రచురణలు మరియు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై బోర్డు కీలక తీర్మానాలు చేసింది. ఉర్దూ ఘర్-కమ్-షాదీఖానాల సమర్థవంతమైన నిర్వహణ, ఆదాయ వృద్ధి,ఆస్తుల పరిరక్షణ మరియు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రస్తుత జి.ఓ.లలో అవసరమైన సవరణల కోసం ప్రభుత్వానికి ప్రత్యేక ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ల కోసం పరికరాల కొనుగోలు నిమిత్తం నిధులు విడుదల చేసినప్పటికీ,సరఫరాలో ఆలస్యం కావడంపై బోర్డు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సరఫరా చేయని పరికరాల నిధులను వెంటనే తిరిగి చెల్లించాలని ఎపిటీఎస్ కు లేఖ రాయాలని,అవసరమైతే ప్రత్యామ్నాయ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తీర్మానించింది. రాష్ట్రంలోని 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లలో 2026 ఆగస్టు 15వ తేదీ నుండి ఎడిసిఎ మరియు మల్టీ లాంగ్వేజ్ డీటీపీ కోర్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని బోర్డు స్పష్టం చేసింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయడానికి,ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించడానికి మరియు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకునేందుకు డైరెక్టర్/సెక్రటరీకి బోర్డు పూర్తి అధికారాలను అప్పగించింది.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

- పల్లెబాటలో అవగాహన కల్పించిన పత్తికొండ సీఐ




**పత్తికొండ మన జనప్రగతి జూలై 27:-**పై అధికారుల ఆదేశాల మేరకు పత్తికొండ అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈగల్ టీమ్, పోలీసు సిబ్బందితో కలిసి ఎన్డీపీఎస్ చట్టం1985పై అవగాహన కార్యక్రమం, పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పత్తికొండ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి అక్రమ రవాణా, నిల్వ, విక్రయం, వినియోగంపై చట్టం ప్రకారం తీసుకునే చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పదంగా మాదక ద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, సమాజాన్ని వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ పిలుపునిచ్చారు.

# రాచపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**చిట్వేలి మన జనప్రగతి జూలై 27:-**చిట్వేలి మండలం మైలపల్లి పంచాయితీ రాచపల్లి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు అరవ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భవిష్యతులో గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రూ. 20 లక్షలతో చేపట్టిన ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా ఉన్న రవాణా ఇబ్బందులు తొలగి, సౌకర్యవంతమైన ప్రయాణానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


## CHANGE OF SURNAME

I, **DEVARINTI KONDA REDDY,** Son of **DEVARINTI KONDA REDDY,** residing at 39/133-G-H, Pujari Banda, S.N. Colony, Rayachoti, Annamayya District, Andhra Pradesh – 516269, do hereby declare that, due to an error, my name and the names of my wife and daughter were previously recorded incorrectly in certain documents.

The incorrect and correct names are as follows:

**My Name:** Wrong Name: **D. Konda Reddy**
Correct Name: **Devarinti Konda Reddy**

**My Wife's Name:** Wrong Name: **D. Vivekhitha**
Correct Name: **Devarinti Vivekhitha**

**My Daughter's Name:** Wrong Name: **D. Varshitha**
Correct Name: **Devarinti Varshitha**

I hereby declare that the above-mentioned correct names shall be used for all legal, official, and personal purposes. Both the incorrect and correct names refer to the same persons, and this declaration is made to avoid any future confusion.


PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174